క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ

సుండుపల్లె(రాజంపేట) : జిల్లా పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో సుండుపల్లె బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం డీఎస్పీ మహబూబ్‌బాషా ప్రారంభించారు. వేసవికాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రతి ఒక్కరి దాహార్తి తీర్చడానికి జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని డీఎస్పీ తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హుస్సేన్‌బాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ బదిలీ

ఓబులవారిపల్లె : మండల ఎంఈఓగా విధులు నిర్వహించిన పద్మజ బదిలీపై కాశినాయన మండలానికి వెళ్లారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెను ఆర్‌జేడీ ఇటీవలే విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం విదితమే. విచారణ జరుగుతుండగా ఆమెను కాశినాయన మండలానికి బదిలీ చేస్తున్నట్లు ఆర్‌జేడీ వై.వెంకటకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

పుల్లంపేట : ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎస్.రమణ అన్నారు. బుధవారం పుల్లంపేట మండల పరిధిలోని పుత్తనవారిపల్లి, దళవాయిపల్లి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లను, ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, ఫీజులు కాలిపోయిన వెంటనే మరమ్మతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ సురేంద్ర, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఓబులవారిపల్లె : పది పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో తల్లెంవారిపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాణించారు. పాఠశాల ప్రారంభించిన ఏడాదే పరీక్ష రాసిన 41 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులోనూ 15 మంది విద్యార్థులు 500కు పైచిలుకు మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించాలి

రాయచోటి అర్బన్ : పట్టణ ఆరోగ్యకేంద్రాలు నిర్దేశించిన 100 శాతం లక్ష్యాలను సాధించాలని డీపీఎంఓ (జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి) డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని వాల్మీకి వీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీహెచ్‌సీలలో రోజువారి సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలంటూ సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

వైభవంగా తిరునాల

వీరబల్లి (రాయచోటి టౌన్) : ఒడివీడు గ్రామంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి తిరునాలు అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం స్వామి వారి ఆలయంలో ఆలయ ధర్మకర్త పోరుమావిళ్ల చలపతి ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణం వేదపండితులు నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సాయికుమార్ రాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చాందినీ బండ్లు, చెక్క భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నీటి సమస్య లేకుండా చూడాలి

చిన్నమండెం : మండలంలో ఎక్కడా నీటిసమస్య లేకుండా చూడాల్సిన ఆవశ్యకత అధికారులపై ఎంతైనా ఉందని ఎంపీపీ సుధా మాధురి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరినాథరెడ్డితో మాట్లాడుతున్న నీటి సమస్య ఎక్కడున్నా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 8 ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని ఎక్కడ సమస్య తలెత్తినా మరికొన్ని ట్యాంకర్లను అమర్చేందుకు సిద్ధంగా ఉన్నామని సభలో తెలియజేశారు. అనంతరం పలువురు మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేయండి

లక్కిరెడ్డిపల్లె : ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ రెవెన్యూ సిబ్బంది బుధవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ సమ్మద్ ఖాన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రాములోరి కల్యాణం



రాజంపేట టౌన్: స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



రాజంపేట టౌన్: ప్రత్యేక అలంకరణలో కల్యాణ ఉత్సవమూర్తులు



రైల్వేకోడూరు: కల్యాణ వేడుకలో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని వత్తలూరు రోడ్డులో ఉన్న రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆ ప్రాంత ప్రజలు ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారాముల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చగా ప్రముఖ పురోహితులు భాస్కర్‌స్వామి, శివప్రసాద్‌స్వామి నేతృత్వంలో స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పురోహితులు సీతారాముల గొప్పతనం గురించి కథ రూపంలో భక్తులకు తెలియజేశారు. రాములోరి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

రైల్వేకోడూరు : మండలంలోని బొజ్జవారిపల్లె గ్రామంలో మాజీ సర్పంచ్ మావిళ్ల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామచంద్రుడు ఆదర్శప్రాయుడన్నారు. గ్రామగ్రామాన ప్రజలు ఆయనను ఆరాధించడం మన సంస్కృతికి నిదర్శనమన్నారు. శ్రీరామ నవమి మహోత్సవాలలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో ముప్పాల హేమనవర్మ, సుధాకర్‌రాజు, సర్పంచ్ సుబ్బయ్య, నాగతిరుమల రావు, దాడిశెట్టి సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు ఓబిలి కాలనీలో..



పెనగలూరు: ఓబిలి కాలనీలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల పరిధిలోని ఓబిలి కాలనీలో సీతారాముల కల్యాణం బుధవారం ఉదయం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాలతో కల్యాణ క్రతువు నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రికి కోలాటం, గ్రామోత్సవం నిర్వహించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

నేడు కల్యాణం

పుల్లంపేట : నేడు కోనెయ్యగారిపల్లి పంచాయతీలో రాములవారి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాగా పిచ్చిరెడ్డి తెలిపారు. కల్యాణంలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నందలూరులో..

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని అరవపల్లి క్రీడా మైదానం వద్ద వెలసిన శ్రీ సీతారాముల దేవస్థానంలో కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం సాయంత్రం పురోహితులు సరసా రవి కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి వేదికపైన ఆశీనులు చేశారు. కల్యాణానికి అతిథులుగా ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ జి.వెంకటసుబ్బారెడ్డిలు పాల్గొన్నారు. కల్యాణానికి ఉభయదారులుగా గోర్ల శ్రీనాథ్, శైలజ దంపతులు వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదాలను మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, హిమగిరినాథ్ యాదవ్, సయ్యద్ అమీర్‌లు ఏర్పాటు చేశారు.

ప్రజలు జగనన్న పాలననే కోరుకుంటున్నారు



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సతీమణి

రాయచోటి అర్బన్ : ప్రజల మరోమారు జనరంజకమైన జగనన్న పరిపాలననే కోరుకంటున్నారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సతీమణి శివలలిత అన్నారు. బుధవారం ఆమె మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలసి పాతరాయచోటిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులలో వైఎస్ఆర్‌సీపీ ప్రచారానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి ఇంటివద్ద మహిళలు ఘనంగా స్వాగతం పలుకుతూ, మంగళహారతులు ఇస్తూ ఆత్మీయంగా ఆదరిస్తున్నారన్నారు. ప్రజలంతా వైఎస్ఆర్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓట్లువేసి మరోమారు జగనన్నను ఆశీర్వదించాలంటూ కోరారు. ఆమె వెంట కౌన్సిలర్లు గువ్వల లక్ష్మీదేవి, జ్యోత్స్న, వైఎస్ఆర్‌సీపీ నేతలు గువ్వల బుజ్జిబాబు, అన్నయ్య, ఆనందరెడ్డి, బేపారి మహమ్మద్‌ఖాన్, జానం రవీంద్ర, జానం రాధ, రియాజ్ అహమ్మద్, ఫయాజ్ అహమ్మద్, సుగవాసి శ్యామ్‌కుమార్, ఎమ్మెల్యే పీఏ నిస్సార్, వైఎస్ఆర్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలే గెలుపునకు సోపానాలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆకేపాటి భరత్‌రెడ్డి

సిద్దవటం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు సోపానాలని ఆకేపాటి సాయి భరత్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని బొగ్గిడివారిపల్లె, ఆకురోపల్లె, చాముండేశ్వరిపేట, గంగానగర్, పాలకొండ్రాయునిపల్లె, వడ్డివారిపల్లె, కొమ్మనాయునిపల్లె, నిర్మలగిరి కాలనీ గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ కరపత్రాలను అందిస్తూ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.వి. మిథున్‌రెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఏకుల రాజేశ్వరిరెడ్డి, పల్లె సుబ్బరామిరెడ్డి, వల్లిచాన్, సింగం క్రిష్ణారెడ్డి, మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, ఎ.క్రిష్ణచైతన్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే జగనన్నను సీఎం చేస్తాయి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేస్తాయని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కోమంతరాజుపురం పంచాయతీలోని గ్రామాలలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ప్రజల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుపరిచారన్నారు. ఒక గ్రామంలో 50 కుటుంబాలు ఉంటే ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల లబ్ధి పొందారన్నారు. వైఎస్సార్‌సీపీపై చూపిస్తున్న అభిమానం చూస్తుంటే భారీ మెజార్టీ సాధించగలుగుతామని ధీమా వ్యక్తం చేశారు. ఫ్యాను గుర్తుపై ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులకు, ఎంపీ అభ్యర్థి మిథున్ రెడ్డికి చెరో ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, శివ, కేతా చక్రపాణి, శ్రీనివాసులురెడ్డి, బీఎల్ నరసింహారెడ్డి, జయరామయ్య, వెంకటరెడ్డి, సానారెడ్డి, నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలానే కోమంతరాజుపురం పంచాయతీలోని పలు గ్రామాల్లో వైస్ ఎంపీపీ కె.విజయ్ రెడ్డి బుధవారం ప్రచారం జరిపారు. సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి మరీ పథకాలను అందించిన ముఖ్యమంత్రి మరెక్కడ ఉండరని చెప్పారు. పేదల ఆర్థికాభివృద్ధికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపిద్దామని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

‘ముస్లింలు కూటమి పార్టీలకు ఓటెయ్యరు’

రాజంపేట : ముస్లిం ఓటర్లు జనసేన, టీడీపీకి ఓటు వేస్తే అది ముస్లిం వ్యతిరేక బీజేపీకి ఓటు వేసినట్టేనని గుర్తుంచుకోవాలని నందలూరు మండల కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా ఖాన్ (కలీం) విన్నవించారు. బుధవారం రాజంపేటలో మేడా భవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. ముస్లిం ఓటర్లు చైతన్యవంతులన్నారు. ఎటువంటి పరిస్థితిలో ముస్లింలు ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఓటు వేయరనేది నిత్యసత్యమన్నారు. ముస్లింలను తప్పుదోవ పట్టించి వారి ఓట్లను రాబట్టుకునేలా చంద్రబాబు, పవన్‌లు కుటిల రాజకీయ యత్నాలు చేస్తున్నారని, వారి మాటలను ఖాతరు చేయనవసరం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇప్పించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కిందన్నారు. ముస్లింల సంక్షేమమే తన ధ్యేయమన్న రీతిలో పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా ముస్లింలపై ఉందన్నారు. ముస్లిం సమాజాన్ని దెబ్బతీసే కుట్ర బీజేపీ చేస్తోందన్నారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేసి ముస్లింల షరియా చట్టాన్ని కనుమరుగు చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ముస్లిం సమాజాన్ని నాశనం చేసేందుకే కూటమి పార్టీలు జత కట్టాయని దుయ్యబట్టారు. రాజంపేట పరిసర ప్రాంతాల ముస్లిం సోదరులు ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ రెడ్డిలకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 40 కుటుంబాలు



సిద్దవటం: ఆకురోపల్లెలో వైఎస్ఆర్‌సీపీలో చేరిన వారితో ఆకేపాటి సాయిభరత్‌రెడ్డి



సంబేపల్లె: వైఎస్సార్‌సీపీలోకి చేరిన అడవికమ్మపల్లె వాసులు

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీలోని ఆకురోపల్లె, పాలకొండ్రాయునిపల్లె గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు బుధవారం స్థానిక నాయకుడు శోభన్‌రెడ్డి, సుధారాయుడు, సుధాకర్ ఆధ్వర్యంలో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి తనయుడు ఆకేపాటి సాయి భరత్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ఆకురోపల్లెకు చెందిన 10 కుటుంబాల వారు గాలి పాలకొండయ్య, మాజీ సర్పంచ్ గాలి సుబ్బయ్య, పి.సుబ్బరాయుడు, గాలి సుబ్బరాయుడు, గాలి నారయ్య, రమణయ్య, కొండయ్య, పెద్ద పాల కొండయ్య, పులి సుబ్బరాయుడు, గాలి చిన్న కొండయ్య, పులి ఓబులేస్, గాలి రవి ఉన్నారు. పాలకొండ్రాయునిపల్లె గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపిలో చేరారు. వీరు కుప్పాల శేఖర్, సుబ్బరాయుడు, కే. రవి, కె. మదు, కోనేటి వెంకట సుబ్బయ్య, నారాయణ, కడితం పాలయ్య, చెన్నం శెట్టి రఘురామయ్య, కూసెట్టి చిన్న వెంకటసుబ్బయ్య, శివనారాయణ, రామనాథ్‌లు ఉన్నారు. తాము ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు పరిచిన సంక్షేమ పథకాలకు ఆకర్శితులమై టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి ఏకుల రాజేశ్వరిరెడ్డి, పల్లె సుబ్బరామిరెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు వల్లిచాన్, చంద్రహాస్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఎల్ఐసీ గంగిరెడ్డి, బొగ్గిడి సుబ్బారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, రోశిరెడ్డి, పుల్లారెడ్డి, ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, టి.వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : మండల పరిధిలోని అడవికమ్మపల్లెలో మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ రెడ్డి, అనిరుద్‌రెడ్డిలు వారికి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

రాష్ట్రాభివృద్ధికి జగన్‌ను గెలిపించుకుందాం



ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటిలను స్వాగతం పలుకుతున్న కొత్తపల్లె ప్రజలు

వీరబల్లె (రాయచోటి టౌన్) : రాష్ట్రాభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వారు వీరబల్లె మండల పరిధిలోని తాటికుంటపల్లె, కొత్తపల్లె, వడ్డెపల్లె, గుర్రప్పగారిపల్లె, కొత్తవడ్డెపల్లె, సీతంపేట, మొరవపల్లె, శికారుపాలెం, మట్లిరెడ్డివారిపల్లె, హరిజనవాడ తూర్పుపల్లె, గుట్టమడమర, గుట్టతూర్పు హరిజనవాడలలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ప్రచారానికి వచ్చిన నాయకులను ప్రజలు, కార్యకర్తలు అపూర్వ స్వాగతాలు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల జీవితాల్లో మార్పులు రావాలంటే జగన్‌ను సీఎం చేసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చిత్తశుద్ధితో వైఎస్సార్‌సీపీ కృషి చేసిందన్నారు. కూటమి పార్టీ మోసపూరిత వాగ్దానాలను నమ్మితే రాష్ట్ర భవిష్యత్తు అంధకారమేనంటూ హెచ్చరించారు. అన్ని వర్గాల సంతోషం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందామని తెలియజేశారు. ఎంపీ అభ్యర్థి అయినా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అయినా ఆకేపాటి అమరనాథరెడ్డిల ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి భారీ మెజార్టీ గెలిపించాలని అభ్యర్థించారు. తదుపరి తూర్పుపల్లెలో మాజీ సర్పంచ్ లక్షుమ్మయ్య నిర్వహించిన గృహ ప్రవేశంలో వారు పాల్గొని ఆయన ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి మదన్‌రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, వీఆర్ రెడ్డి, సర్పంచ్ గోపినాథరెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, సీతంపేట వెంకట్రాజు, కిశోర్‌రెడ్డి తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు

- జగనన్నను గెలిపించుకుంటేనే భవిష్యత్
- హసనాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిలు



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిలు

రామాపురం : వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాలలో వెలుగులు నిండుతాయని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 5:30 గంటలకే రామాపురం మండలం హసనాపురం గ్రామంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీ జన సందోహం మధ్య పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజల ఆత్మీయ ఆదరాభిమానాల మధ్య ముమ్మరంగా ప్రచారం సాగింది. గ్రామంలోని కొండావాండ్లపల్లె, గొల్లపల్లె, పప్పిరెడ్డిగారిపల్లె, దళితవాడ, హసనాపురం, ఎర్రంగివాండ్లపల్లె, చీకటివాండ్లపల్లెలోని ఇంటింటికి తిరిగారు. ప్రజలకు జగన్ ప్రభుత్వం చేసిన మేలును, అభివృద్ధిని కూలంకషంగా వివరించారు. మరింత అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ఆదరించాలని అభ్యర్థించారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చారన్నారు. జగనన్నను గెలిపించుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ధర్మయుద్ధం చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని, అధర్మ కూటమికి బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనకు గత టీడీపీ పాలనకు ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రూ.2.70లక్షల కోట్ల నిధులను సంక్షేమ పథకాల ద్వారా అందించి పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ చేయూతనందించారన్నారు. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గడికోట సుదీప్‌రెడ్డి, మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథరెడ్డి, రెస్కో మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే పేదలకు ఆర్థిక స్వావలంబన



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

చిట్వేలి : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, అందుకు మీ ఆశీర్వాదం కావాలని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రజలను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం నగిరిపాడు పంచాయతీలోని ఎస్.ఉప్పరపల్లి, కుమ్మరపల్లిలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి వలన జరిగిన లబ్ధిని ఇంటింటికి తిరుగుతూ వివరించారు. రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కొరముట్ల శ్రీనివాసులు ఓటర్లను అభ్యర్థించారు. పేదలు ఆర్థిక స్వాలంబన సాధించాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్ర, హేమనవర్మ, సర్పంచ్‌లు బాలు, సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలి



సుండుపల్లెలో ప్రచారం చేస్తున్న జకియాఖానం

సుండుపల్లె(రాజంపేట) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిను ముస్లింలు ఆశీర్వదించి ఆయనకు అండగా, వెన్నుదన్నుగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం పిలుపునిచ్చారు. సుండుపల్లెలో ముస్లిం నివాసిత ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడి ఫ్యాన్ గుర్తుపై రెండుసార్లు బటన్ నొక్కాలని కోరారు. అందులో ఒకటి ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, మరొకటి ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డికి వేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి సీఎం కావడంతోనే ముస్లింల సంక్షేమం కొనసాగుతుందనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ అజంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌రెడ్డి, రామస్వామిరెడ్డి, ఎ.మధుసూదనరెడ్డి, మైనార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం రాజంపేట ముస్లిం మైనార్టీ నాయకులతో జకియా ఖానం భేటి అయ్యారు. ముస్లిం సామాజికవర్గానికి చెందిన ప్రతి ఓటు ఫ్యాన్ గుర్తుకు వేయించేలా అందరూ పని చేయాలన్నారు. ఈ భేటిలో జాహిద్‌అలీ, ముస్లిం మత పెద్ద హైదర్, ఖాజామొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ మసూద్‌అలీఖాన్, ఖలీల్, అక్తర్, మౌలాలి, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.